విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజ నెం. 9
మంగళవారం 4, మార్చి, 2025

నియోజవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

హిరమండలం/పాతపట్నం : సోమవారం పాతపట్నం నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయాలని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అసెంబ్లీలో విన్నవించు కున్నారని ఎమ్మెల్యే గోవిందరావు, అలాగే నియోజకవర్గం లోని పలు సమస్యలు పై అసెంబ్లీలో ప్రస్తావించుకున్నట్లు విలేకరులకు తెలిపారు. వలసలను నివారించి నిరుద్యోగ యువతకు, ప్రజలకు, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు కూడా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.

బడ్జెట్ అన్ని రంగాలు వర్గాలను సంతృప్తి పరిచింది

- స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు
- మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్

విశాలాంధ్ర - ఆమదాలవలస : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్లో సంక్షే మ, అభివృద్ధికి, హామీల అమలకు, సమ ప్రాధాన్యత ఇచ్చిందని బడ్జెట్ వలన స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాలు, రంగాల వారిని సంతృప్తి పరిచేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో బడ్జెట్ ఉందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ నా బీసీ నా మైనారిటీలంటూ ప్రాంతీయ అసమానతలు సృష్టించి కనీస కేటాయింపులు చేయకుండా విస్మరించారని గుర్తు చేశారు. మైనారిటీ రైతులు మహిళలు కొనుగోలు శక్తి పెరిగేలా ప్రాంతీయ అసమానతలు అధి గమించేలా అభివృద్ధి వికేంద్రీకరణకు బడ్జెట్ ఎంతో ప్రాధాన్యతను ఇచ్చిందని వివరించారు. వైసిపి పాలనలో మూలధనం ఖర్చు పెట్టకపోతే ఆర్థిక వృద్ధి ఉండ దని కనీస ప్రాథమిక సూత్రాన్ని కూడా పాటించలేదన్నా రు. ఇచ్చిన మాటను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 3,22,359 కోట్ల రూపా యలతో 2025 -26 ఆర్థిక సంవత్సరానికి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిల బడ్జెట్ ఉందని స్పష్టం చేశారు. గత ప్రభు త్వం సంక్షేమం పేరుతో నిధులు కేటాయించి దారి మళ్లించి నిధులు దుర్వినియోగం చేస్తారని ఆక్షేపించారు. ప్రస్తుత బడ్జెట్లో అటు వంటి అవకాశం లేకుండా రూపొందించడం జరిగిందన్నారు. గత పాలకులు ప్రజలపై విధించిన పందుల భారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పన్నులు భారం లేకుండా చేశారన్నారు. వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేసింది. పెట్టుబడి సాయం కింద 6,300 కోట్లు కేటా యించారని తెలిపారు. నూకరాజు, నందివాడ గోవిం దరావు, కూన అప్పలనాయుడు, నేతింటి జ్యోతిశ్వ రరావు, పివి రమణమూర్తి, విశ్వనాథం, సిద్ధార్థ లు బడ్జెట్ పై మాట్లాడుతూ వైసీపీ చేసిన విధ్వంసం నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ సంక్లిష్ట పరిస్థితుల ను అధిగమిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి బడ్జెట్ దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రంగాలను అభివృద్ధి పరచడంలో భాగంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆర్థిక మంత్రి పయ్యా వుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదియో గ్యమైనదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు వురు నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొంక్యాన ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. నగరంలోని కెమిస్ట్రీ డ్రగిస్ట్ భవనంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో కొంక్యాన ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, ట్రస్టు సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, జేసీస్ అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి చేతుల మీదుగా సన్మానించారు. సత్కారం అందుకున్న వారిలో వివిధ రంగాలకు చెందిన మహిళలు, గృహిణులు సకలా భక్తుల అరుణకుమారి, బోయిన సరోజని, జామి రాధాగౌరి, శశికళ, వారాడ భాగ్యలక్ష్మీ, తంగుడు సీతారత్నం, యాలాల ఇందిర, ఆర్. మహాలక్ష్మీ, సి. హెచ్.సంధ్యారాణి, పంచాది లక్ష్మీ ఉన్నారు.

ఎట్టకేలకు ప్రదీప్ అరెస్ట్

విశాలాంధ్ర - సోంపేట : బట్టిగళ్లూరు పిహెచ్సి ఉద్యోగి మద్ది ప్రదీప్‌ను బారువ పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇటీవల బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ప్రదీప్ నిందితుడిగా ఉన్న విషయం తెల్సింది. తులసి తండ్రి హరికృష్ణ ఫిర్యాదు మేరకు కొనసాగుతున్న పోలీస్ దర్యాప్తులో మద్ది ప్రదీప్‌ను అరెస్ట్ చేయకపోవడం పట్ల బారువ కొత్తూరు మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే మూడు రోజుల క్రితం వందలాదిగా వచ్చి బారువ పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టిన విషయం విధితమే. అంతేగాకుండా శనివారం గ్రామంలో ప్రత్యేకంగా సమావేశమైన మత్స్యకారులందరూ మృతురాలు తులసి కుటుంబానికి బాసటగా నిలుస్తూ ఆదివారంలోగా అరెస్ట్ చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామంటూ అల్టిమేటం జారీ చేసిన సంగతి తెల్సిందే. ఈ పరిణామాల నడుమ ప్రదీప్‌ను అరెస్ట్ చేయడంతో కొంత మేరకు గ్రామస్తులు శాంతించినప్పటికీ వెంటనే నిందితుడిపై చార్జిషీట్ వేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రతిరోజు రాజకీయనేతలు, వివిధ సంఘాల నేతలు బారువ కొత్తూరు గ్రామంలో తులసి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ బాధిత కుటుంబానికి పోలీసులు న్యాయం చేయాలని కోరుతున్నారు. సోమవారం ఉదయం వైకాపా నేత మాజీ సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి బారువ కొత్తూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఒక మాజీ హవల్దార్ దేశ రక్షణ కోసం ఎన్నో ఏళ్లు దేశ సరిహద్దుల్లో శ్రమించారని అటువంటి కుటుంబానికి పోలీసులు, న్యాయ వ్యవస్థ సత్వరం న్యాయం చేయాలని కోరారు.

సరుబుజ్జిలి మండలంలో 204 రోడ్డు పనులకు నిధులు

ఎమ్మెల్యే పీయూసీ చైర్మన్ కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : మండల పరిధిలోని వివిధ గ్రామాలను కలుపుతూ 204 సిమెంటు రోడ్డు పనులకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలం లోని 204 రోడ్డు పనులకు గాను 1898.80 లక్షల రూపా యలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు అయ్యాయని వివరించారు. ఈ నిధులతో మండలం లోని అన్ని గ్రామాలకు సిమెంటు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లు నిధుల విడుదల చేసినందుకు రవికుమార్ అభినందనలు తెలిపారు.

గొర్రెలు, మేకలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : గొర్రెలు, మేకలు పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీష్ అన్నారు. సోమవారం అనంతగిరి సచివాలయం పరిధిలో గొర్రెలు, మేకలు పెంపకందారులతో సమావేశం ఏర్పాటు 'చేశారు. నందిగాం సహాయ సంచాలకులు డాక్టర్ మట్ట రవి క్రిష్ణారావు మాట్లాడుతూ మేకలు, గొర్రెలు పెంపుకు, యాజమాన్య పద్ధతులు గూర్చి రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వజ్రపు కొత్తూరు పశువైద్య అధికారి మెట్ట పాపారావు, సిబ్బంది పూర్ణిమ, కాంతారావు, గ్రామస్తులు మరడ దుర్యోధనరావు, ఉంగ భుజంగరావు పాల్గొన్నారు.

చిన్న కోరాడకు ట్యాంక్ ద్వారా త్రాగు నీరు పంపిణీ

విశాలాంధ్ర - హిరమండలం : సోమవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో త్రాగు నీటి బోర్లకు తగినంత త్రాగు నీరు అందక పోవడం తో త్రాగు నీరు సరఫరా అందని పలు వీధుల లో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాలు మేరకు, సర్పంచ్ దేవుడల సుందరమ్మ, వార్డు మెంబర్ లు ఆధ్వర్యంలో హెల్పింగ్స్ హేండ్స్ అధ్యక్షులు పి శ్రీధర్ వాటర్ ట్యాంక్‌తో త్రాగు నీటిని సోమవారం సరఫరా చేయడం జరిగిందని ఈఓటి హరికృష్ణ తెలిపారు. ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు పర్యవేక్షణ లో గ్రామ పంచాయతీ సిబ్బంది చిన్న కోరాడ వీధి లోని ఇంటింటికి త్రాగు నీటిని సరఫరా చేయడం జరిగిందని జూనియర్ సహాయకులు డి.కార్తీక్ తెలిపారు, తచిన్న కోరాడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకాల పనితీరు పరిశీలన

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం వెంకటాపురం పంచాయతీ వెంకటాపురం, శివరాంపురం, సవర శివరాంపురం అలుదు గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలను సోమవారం మండల అభివృద్ధి అధికారి పీవీవిఎం మోహన్ కుమార్ పంచాయతీ విస్తరణ అధికారి ప్రభాకర్ రావు పరిశీలించారు. వాటి పనితీరు ఎంతవరకు తాగునీరు అందుతుంది పలు అంశాలను స్థానిక అధికా రులను పాలకులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు ఎటు వంటి తాగునీటి కష్టాలు పడకూడదని దీనికి సచివాలయ రక్షిత నీటి పథక శాఖ పలువురు ప్రత్యేక దృష్టితో ఉండాలని ఆయన సూచించారు. మూడు నెలలు మహా వేసవిలో ప్రజలు త్రాగునీటికష్టాల పడకూడదని ఆయన అన్నారు.

శ్మశానంలో పార్క్ ప్రారంభం

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక సంతతోట సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో పార్క్‌ను మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకర రావు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. నరసన్నపేట సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, కాశిన రమేష్ తనయుడు, దివంగత జస్వంత్ గత సంవత్సరం మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. నేడు ప్రథమ వర్ధంతి సందర్భంగా శ్మశాన వాటికలో జస్వంత్ జ్ఞాపకార్థం పార్క్ నిర్మించటం జరిగింది. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, సొసైటీ గౌరవ అధ్యక్షులు, పుచ్చల విశ్వేశ్వరరావు, అధ్యక్షులు, ఎస్.మురళీధరరావు తదితరులున్నారు.

అంతరించిపోతున్న వన్యప్రాణాలను కాపాడాలి

ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం

విశాలాంధ్ర - పలాస : అంతరించిపోతున్న వన్యప్రాణులను కాపాడాలని పలాస ఎంపీడీవో కె.వసంత్ కుమార్ అన్నారు. సోమవారం పలాస ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస ఎంపీడీవో కే వసంత్ కుమార్ మాట్లాడుతూ అంతరించి పోతున్న వన్య ప్రాణులను కాపాడాలని,డి ఫారెస్ట్ షన్ వలన మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు.పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మరియు స్పెషల్ ఆఫీసర్ వలాస డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్యం కాపాడుకోవడంలో వన్య ప్రాణులు చాలా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ ఆవాసాల నాశనం, వాతావరణ మార్పు, వేట, అక్రమ రవాణా, మొక్కలు నరికివేత వలన అనేక వన్యప్రాణ జాతులకు ముప్పు కలుగుతుందని, మొక్కలు నాటితే పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి మెట్ట వైకుంఠ రావు, ఇరిగేషన్ అధికారి పి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సిబ్బంది కొర్ల మన్మథరావు, సంపతి రావు ఉమా ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కవిటి : జాతీయ వైజ్ఞానిక దినోత్సవం వేడుకల్లో భాగంగా సోమవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రాథమిక స్థాయిలో గొల్లకరాపాడు ఎంపిపి స్కూల్ ప్రథమస్థానం, కవిటి ఎంపిపి స్కూల్ ద్వితీయ స్థానం, కమలాయిపుట్టుగ ఎంపిపి స్కూల్ తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే సెకండరీ విద్యార్థులకు నిర్వహించిన దాంటో బొరివంక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం, ముత్యాలపేట విద్యార్థులు ద్వితీయస్థానం, కుసుంపురం విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. అలాగే సింపోజియం పోటీలలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మొదటి స్థానం, ముత్యాలపేట రెండవస్థానం, శిలగాం ఉన్నతపాఠశాల తృతీయ స్థానం సాధించారు. అలాగే వైజ్ఞానికి ప్రదర్శన పాతకొజ్జిరియా ఉన్నత పాఠశాల మొదటి స్థానం, సిహెచ్ కపాసుకుద్ది ప్రాథమికోన్నత పాఠశాల రెండవ స్థానం, కవిటి ప్రధమిక పాఠశాల మూడవ స్థానం నిలిచారు. విజేతలకు ఎంఈవో ధనుంజయ మజ్జి బహుమతులు అందజేశారు. అలాగే ఇందులో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్స్ నిల్వదారునిపై చర్యలు : కమిషనర్ బాలాజీ ప్రసాద్

విశాలాంధ్ర - ఆమదాలవలస : నిషేధిత ప్లాస్టిక్స్ ను అక్రమంగా నిలువ ఉంచిన వ్యక్తి పై చర్యలు తీసుకుని జరిమానా విధించడం జరుగు తుందని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. సోమవారం 2016 ప్రభుత్వ ఆదే శాలకు మేరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై నిషేధం ఉన్నందున అటువంటి వాటిని నిల్వ ఉంచిన వారిపై చర్యలు తప్పమన్నారు. కమిషనర్ ఆదేశాలతో మెట్ట క్కివలస సచివాలయ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను విక్ర యిస్తున్న వ్యాపారి వద్ద నుంచి వస్తువులను స్వాధీన పరుచుకుని జరిమానా విధించినట్లు సచివాలయ వార్డ్ శానిటేషన్ మరియు ఎన్విరాన్మెంట్ సెక్రటరీ వివ రించారు. సింగిల్ యూజచ ప్లాస్టిక్ ను విక్రయదారుల పైన వాటిని కలిగి ఉన్న వ్యాపారుల పైన చర్యలు తీసుకోవడం తప్పదు అన్నారు. నిషేధిత వస్తువులను వినియోగించడం కూడా నేరమే అని తెలిపారు. మున్ముందు ఇటువంటి చర్యలకు పాల్పడితే భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేడు వైసీపీ ఇన్‌చార్జి కురసాల రాక

విశాలాంధ్ర - హిరమండలం : నేడే అనగా తేదీ 4. 3.2025 ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయముకు ఉత్తరాంధ్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కురసాల కన్నబాబు విచ్చేయుచున్నారని జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి అందవరం వెంకట్ సురేష్ సోమవారం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ ంనకు వైసీపీ అభిమానులు కార్యకర్తలు నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఎవి సురేష్ ప్రకటన లో కోరారు. పాతపట్నం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు రెడ్డి శాంతి ఆదేశాల మేరకుహిరమండలం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ హెూదాలో ఉన్న నాయకులు, జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉన్న మహేంద్ర షోరూం కంపెనీ ప్రక్కన ఉన్న వైయస్సార్‌సిపి కార్యాలయంకి హాజరు కావలసిందిగా పత్రికా ముఖంగా వెంకట్ సురేష్ కోరారు.

శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

అసెంబ్లీలో పియూసీ చైర్మన్ కూనరవికుమార్

విశాలాంధ్ర - పొందూరు : శ్రీకాకుళం జిల్లాలో గిరిజనులకు సేవలందించేందుకు ఐటీడీఏ ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని పియూసీ చైర్మన్, ఆముదాలవలస ఏమ్మెల్యే కూన రవికుమార్ అసెంబ్లీలో సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయిన తరువాత శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ లేకుండా పోయిందని అన్నారు. జిల్లాలోని పాతపట్నం, పలాస, టెక్కలి, నరసన్నపేట, నియోజకవర్గాలలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను పునర్విభజన చేసిన తరువాతి శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు పై నిర్లక్ష్యం వహించింద న్నారు. ఐటీడీఏ లేకపోవడంతో జిల్లాలో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

పరిశోధనా రంగం అభివృద్ధి ద్వారా గుర్తింపు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : బోధన, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాధించిన ప్రగతి ద్వారానే వర్సిటీలు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో సోమవారం నిర్వహించిన ఐక్యూఏసీ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్సిటీలోని అధ్యాపకులు ఈ దిశగా కృషి చేయాలన్నారు. అలాగే వర్సిటీలో సాధించిన ప్రగతిని, అభివృద్ధిని వచ్చే ఏడాది నాక్ బృందం మరోసారి సమీక్షిస్తుందన్నారు. బోధన, పరిశోధనా రంగాల్లో ప్రమాణాలు నెలకొల్పడం, వర్సిటీ పనితీరును మెరుగుపర్చేందుకు అధ్యాపకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. వర్సిటీలోని అన్ని పాలనా విభాగాలు మెరుగైన పనితీరును కనపరచాలన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సి పాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, ఓఎస్‌ఓ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

టాలెంటు టెస్ట్ విజేతలకు అభినందన

విశాలాంధ్ర - కవిటీ : కవిటి మండలం సహలాల పుట్టుగ గ్రామం లో ఫిబ్రవరి 28న సైన్స్ డే సందర్భంగా రఘునాథ్ పాడి మెమోరియల్ టాలెంటు టెస్టు నిర్వహించారు. ఇందులో 53 మంది విద్యార్థులు పాల్గొనగా ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధనుంజయ ప్రధాన్,ఎర్ర ధనలక్ష్మీలు 2వ స్థానం, 4వ స్థానంలో నిలిచారు. వారికి సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రదీప్ కుమార్ గౌడ, ఉపాధ్యాయులు గాయత్రి కుమారి గౌడ, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఒడియా పాఠ్య పుస్తకాల వర్క్ షాప్

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ ఉత్తరాంధ్ర ఒడియా డి.ఐ. దుర్గా ప్రసాద్ చౌధురీ మరియు కో-ఆర్డినేటర్ మురళీ దోళాయి ఆధ్వర్యంలో 1 నుండి 10వ తరగతి ఒడియా పాఠ్య పుస్తకాలు అనువాదం మరియు తప్పులను సరి చేయుటకు వర్క్ షాపు జరిగింది. ఈ కార్యక్రమం సోంపేట మండల విద్యాశాఖ అధికారి ఎస్.జోరాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒడియా పిల్లలకు మిర్రర్ ఇమేజ్ (ఒడియా-ఆంగ్లం) పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం శుభ పరిణామం అని కొనియడారు. పాఠ్య పుస్తకాలు తప్పులు లేకుండా అనువాదం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కోర్సు డైరెక్టర్ దుర్గాప్రసాద్ చౌదరి మాట్లాడుతూ నాన్ లాంగ్వేజ్ పాఠ్య పుస్తకాల అనువాదం మరియు కొత్తగా సంయుక్తమైన విషయాలు నిశితంగా పరిశీలించి సరిచేయలని, సందేహాలుంటే కోఆర్డినేటర్ మురళీ దోళాయిని సంప్రదించాలని ఉపాధ్యాయులను సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామహరి పాఢీ మరియు ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒడియా విద్య ప్రగతికి తోడ్పాటు అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోంపేట మండల విద్యాశాఖ అధికారి ఎస్.జోరాడు,ఉత్తరాంధ్ర ఒడియా డిఐ దుర్గా ప్రసాద్ చౌదరి, కో అర్డినేటర్ మురళీ దోళాయి, జలంత్రకోట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ మిశ్రా, ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామహరి పాఢీ,ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి మరియు ఒడియా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలు రణస్థలం ఏజన్సీకి అప్పగింత



విశాలాంధ్ర - పొందూరు : పట్టణంలో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజన్సీ బాధ్యతలను రణస్థలం గ్యాస్ ఏజన్సీకి తహశీల్దార్ ఆర్. వెంకటేష్ సోమ వారం అప్పగించారు. గ్యాస్ బిల్లు కంటే అదనంగా వసూళ్లు చేస్తున్న విషయం పై పొందూరు పట్టణంలో పలువురు మహిళలు జిల్లా కలక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలక్టర్ విచారణకు ఆదేశించారు. డిజిఓ జి.సూర్యప్రకాష్, తహసీల్దార్ ఆర్. వెంకటేష్ విచారణ జరిపా రు. విచారణ లో రూ40 నుంచి50 అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు నిరూపణ కావడంతో కలెక్టర్ కు దీనిపై నివేదిక అందించారు. నివేదిక ఆధారంగా కలెక్టర్ ఆదేశాలు మేరకు తహసీల్దార్ ఆదివారం రాత్రి గ్యాస్ కార్యాలయం, గొడౌన్లను సీజ్ చేశారు. గ్యాస్ వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూడాలన్న ఉద్దేశంతో జేసీ ఆదేశాలు మేరకు తహసీల్దార్ సోమవారం గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలను తాత్కాలికంగా రణస్థలం గ్యాస్ ఏజెన్సీ కి అప్పగించారు. గొడౌన్ ను సీజ్ చేసే సమయంలో స్టాక్ వివరాలు మేరకు పొందూరు గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు , పొందూరు వీఆర్వో లు ఈశ్వరరావు, శంకరరావు సమక్షంలో రణస్థలం ఏజెన్సీ కి అప్పగించా రు. వినియోగదారుల నుంచి అదనంగా వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండల స్థాయి సారవకోటలో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - జలుమూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సారవకోట కేంద్రంగా మండల స్థాయి క్విజ్ పోటీలు సోమవారం నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ప్రాథమిక స్థాయి క్విజ్ పోటీలో ఎంపీ యుపిఎస్ నవతలప్రథమ స్థానంలోనూ జడ్.పి. హెచ్.ఎస్ సారవకోట ద్వితీయ స్థానంలోనూ ఎంపిక యింది. సెకండరీ స్థాయిలో జడ్పీహెచ్ఎస్ అలుదు ప్రథమ స్థానంలోనూ జడ్పీహెచ్ఎస్ బుడితి ద్వితీయ స్థానంలోనూ జడ్.పి. హెచ్.ఎస్ సారవకోట కోట తృతీయ స్థానంలోనూ ఎంపికయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు నిర్వహించిన ప్రయోగ ప్రదర్శనలో ఎంపీపీ ఎస్ చీడిపూడి ప్రథమ స్థానంలోనూజడ్.పి. హెచ్.ఎస్ సార్వకోట ద్వితీయ స్థానంలోనూ ఎంపిక కాబడ్డాయి. సెకండరీ స్థాయిలో జరిగిన సింపోజియం పోటీలో జడ్పీహెచ్ఎస్ ఆలుదు ప్రథమ స్థానంలోనూ జడ్పీహెచ్ఎస్ బుడితి ద్వితీయ స్థానంలోనూ, జడ్పీహెచ్ఎస్ సారవకోట తృతీయ స్థానంలోనూ ఎంపిక అయ్యాయి మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ పోటీలను పరిశీలించారు ఇక్కడ ఎంపిక అయిన వారు డివిజన స్థాయిలో పోటీలో పాల్గొంటారని అక్కడ విజేతలుగా నిలిస్తే జిల్లా స్థాయికి వెళ్తారని ఎంఈఓ ఎంవి రమణ తెలిపారు.

లక్ష్యాలు చేరుకోకుంటే చర్యలు తప్పవు

జిల్లా నీటి యాజమాన్యం సంస్థ, ప్రాజెక్ట్ డైరక్టర్ సుధాకర్

విశాలాంధ్ర - నరసన్నపేట : ఉపాధి హామీ పథకం సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో చేరుకోకుంటే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ప్రాజెక్ట్ డైరక్టర్, పి.సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంసీసీ స్థాయిలో మెటీరియల్ పనులు పూర్తి చేయటంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. రైతులకు భూగర్భ జలాలు పెంపొందింప చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు వంటి పనులను తక్షణమే పూర్తి చేయించాలని ఆదేశించారు. వంద రోజుల పనిదినాల కల్పన, అడిగిన వారందరికీ ఉపాధిని కల్పించటం అనే అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతీ గ్రామ పంచా యితీ పరిధిలో ఉపాధి పనులు చేపట్టారని, ఆయా మండలాలకు నిర్దేశించిన లక్ష్యాల శాతం చేరుకోవాల్సిం దేనని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ, కె.లోకేశ్వరరావు, నరసన్నపేట క్లస్టర్ పరిధిలో ఏపిఓలు, ఈసిలు పాల్గొన్నారు.

వాహన రూల్స్‌పై పోలీసులు అవగాహన

విశాలాంధ్ర - సోంపేట : ప్రభుత్వాలు వాహన చట్టాలను కఠినతరం చేసిన నేపథ్యంలో వాహనదారులకు, ఆటోవాలాలకు సోంపేట పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మంగరాజు, ఎస్సై లవరాజు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రజలకు అర్థమయ్యేరీతిలో ఎటువంటి తప్పిదానికి ఎంత జరిమానా చెల్లించాలో ఎటువంటి శిక్షలు ఉంటాయో వివరిస్తూ అవగాహన కల్పించారు. హెల్మెట్ విషయంలోను, డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో, అతి వేగంగా వాహనం నడపడంలోను ఎటువంటి జరిమానాలు కోర్టులు విధిస్తాయో స్పష్టంగా తెలియజేశారు.

హత్యకు గురైన వృద్ధురాలు గున్నమ్మ

అర తులం బంగారం కోసం హత్య చేసిన దుండగులు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక కలివరపుపేట వీధి శివార్లలో సోమవారం వేకువజామున ఒక వృద్ధురాలును దారుణంగా హత్య చేసిన ఘటనతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్థానిక బండివీధికి చెందిన కేవిటి గున్నమ్మ(85) ప్రతీ రోజు పువ్వులు ఏరుకొని, స్థానిక శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద పువ్వులు అమ్ముకొని జీవనం సాగిస్తూ ఉండేది. దీనిలో భాగంగా సోమవారం వేకువ జామున పువ్వులు ఏరుతుండగా, మద్యం మత్తులో ఉన్న నలుగురు దుండగులు ఆమె ముక్కులో వున్న అర తులం కమ్ముల కోసం ఆమెను కొంత దూరం వరకూ ఈడ్చుకొని వెళ్ళి, కమ్ములను దొంగిలించి, దారుణంగా హత్య చేశారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్, సి.ఐ, జే.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్ళి, హత్య జరిగిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలు, గున్నమ్మ, కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్ నమోదు చేసి, సి.ఐ, జే.శ్రీనివాసరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ, కె.వి.మహేశ్వరరెడ్డి హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించి, త్వరలో దుండగులను పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్ విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఈసిఈ విభాగానికి చెందిన 320 మంది విద్యార్థులకు ఫిబ్రవరి 24 నుండి మార్చి 6 వరకు ప్రొడెక్టివిటీ ఎన్ హేన్స్మెంట్ టూల్స్ అనే అంశంపై ఎపిఎస్ఎస్‌సి-సిమెన్స్ ఎక్సెలెన్స్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్ఎస్‌డిసి నుండి టి.శ్రీకన్య, సి.సతీష్ కుమార్లు పాల్గొని విద్యార్థులకు గూగుల్ సీట్స్, గూగుల్ స్లైడ్స్, గూగుల్ డ్రైవ్, గూగుల్ ఫార్మ్స్, గూగుల్ డాక్స్ వంటి అంశాలపై తర్ఫీదు ఇస్తున్నట్టు డైరెక్టర్ తెలిపారు. ఈ తరగతులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ వి. అశోక్ కుమార్, డాక్టర్ బి. రామారావు, డాక్టర్ ఈ. జయ, కె.బి. అనూష లు పర్యవేక్షిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప సీజ్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: కింతలి మిల్లు జంక్షన్కు సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను సోమవారం అటవీ శాఖాధికారులు సీజ్ చేశారు. కొంతమంది నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ ఎస్ఎస్వో ఎం. సాయిరాం, బీట్ ఆఫీసర్ భాషాలు ఈ కలపను పరిశీలించారు. సుమారు 150 వరకు కలప దుంగలు ఉన్నట్టు గుర్తించామని, ఈ కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

అటవీ భూములను కాపాడాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని బడివానిపేట పంచాయతీలోని అటవీ భూములను కాపాడాలని మాజీ సర్పంచ్ వారది ఎర్రయ్య, గ్రామస్తులు జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖాధికారులకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న అటవీ భూములను విక్రయించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని విన్నవించుకున్నారు. ఈ భూములను రియ ల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయానికి సిద్ధమవుతున్నారని, దీనిని అడ్డుకుని అటవీ భూములను పరిరక్షించాలని కోరారు.

ఎమ్మెల్సీ 'గాదె' విజయానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులునాయుడు విజయానికి కృషి చేసిన మిత్ర సంఘాలైన ఏపిపిఎఫ్-1938, పిడి అసోసియేషన్ భాషా పండితులు, ఎస్.టి.యు, ఆపస్సు, మొదటి, రెండవ ప్రాధాన్యం ఓటు వేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నామని మండల పి.ఆర్.టి.యు శాఖ ప్రతినిధులు, బి.కేశవరావు, పి.అప్పలనాయుడు అన్నారు. ధన్యవాదములు తెలిపిన వారిలో కే.లక్ష్మణరావు, సత్తిబాబు, జి.చంద్రశేఖర్, గోపి, పాగోటి వాసుదేవరావు, చింతు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు షిరిడి సాయి బాబా ప్రతిష్ఠ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళిలో నూతనంగా నెలకొల్పిన శ్రీ షిరిడి సాయి బాబా ఆలయం ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమం మంగళవారం నుంచి మూడు రోజులు పాటు జరగనుంది. గ్రామస్తులు, సాయి భక్తులు సహకారం స్థానిక ఎర్రబంద వద్ద నిర్మింపబడిన ఈ సాయిబాబా నూతన మందిరంను గురుదేవులు అమ్ముల సాంబ శివరావు (విజయనగరం జిల్లా కందివలస) వారి ఆధ్వర్యంలో సాయి గురు వీర్రాజు, సాయి రుత్విక్ అప్పలనాయుడు, సాయి పురోహితులు సంపత్ కుమార్‌లచే ఈ సాయిబాబా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. మొదట రోజు రక్షా బంధనం అంకురా రోవణం తో ప్రారంభం అయిన ఈ కార్యక్రమం గురువారం సాయిబాబా విగ్రహప్రాణప్రతిష్ఠ నేత్రో న్మలనము, అన్నసమారాధన కార్యక్రమం తో ముగుస్తుందని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు అందరు పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-మందస: మండలంలో వివిధ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి -1 ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కృష్ణాపురం సహాయకులు రాజాన వరమేశ్వరరావు పోటీ పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్ పీలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రారంభమైన వ్యతిరేకత

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల నుండి వ్యతిరేకత ప్రారంభమయ్యిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన రఘువర్మ ఓడిపోయారని, ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు గెలిచారని, ఆయనకు కృష్ణదాస్ అభినందనలు తెలియచేశారు. అధికారం కైవసం చేసుకునేందుకు అమలు కాని హామీలు గుప్పించి, ప్రజల్ని మభ్యపెట్టారని, దాని ఫలితమే తొమ్మిది నెలల్లో ప్రభుత్వంపై వ్యతిరేకరత స్పష్టంగా వ్యక్తమైందని తెలిపారు. రఘువర్మ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన ఉత్తరాంధ్ర కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు కృషి చేసినా ఫలితం దక్కలేదని, కూటమి ప్రభుత్వానికి ఇది కౌంట్ డౌన్ అంటూ వ్యాఖ్యానించారు.

దివ్యాంగుడు అదృశ్యం



విశాలాంధ్ర-మందస: మందస కంచుమాయి కాలనీకి చెందిన దివ్యాంగుడు కరుమోజి సంతోష్ (35) గత నెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి కములమ్మ, అన్నయ్య అవ్వన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతను పుట్టుకతోనే చెవిటి, మూగ, సంతోష్ తండ్రి కృష్ణమూర్తి చిన్నప్పుడే మృతి చెందాడని, తల్లి కమలమ్మకు చేదోడుగా ఉంటూ పోషణ కోసం స్థానిక భోజన హోటల్లో కూలీగా పని చేస్తున్నారని తెలిపారు. హోటల్ పని కోసం ఇంటి వద్ద తల్లికి చెప్పి వెళ్లిన సంతోష్ గత నెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని వారు తెలిపారం. ఎవరికైనా సంతోష్ ఆచూకి కనిపిస్తే 7075502372కు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-మందస: సెకండరీ స్థాయి డివిజనల్ లెవల్‌కు ఎంపికైన హరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు ఉమారాజ్ కు సోమవారం ఎంఇవో -2 ఎన్.తారకేశ్వరరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్పు చక్రధరరావు, గున్న రమణబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ మద్దతుదారులే.. పి.సి.ఎం.ఎ. సారథులు..

ఏకగ్రీవంగా పిసిఎంఏ ఎన్నికలు...!

విశాలాంధ్ర-పలాస: పలాస జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం(పిసిఎంఏ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం కార్యవర్గం అంతా టీడీపీ మద్దతుదారులే సారథులు కావడం గమనార్హం. ఎన్నికలు ఈ నెల నాలుగున జరగాల్సి ఉన్నప్పటికీ నామినేషన్లు ఉపసంహరణ చివరి రోజు ఆదివారం నాడు పోటీ అభ్యర్థులు అధ్యక్షులు మల్లా సురేష్, కార్యదర్శి కె.వి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్ తో పాటు కార్యదర్శి స్థానానికి నామినేషన్ వేసిన సిందిరి సతీష్, కోశాధికారిగా పోటీ చేస్తున్న చుండూరు మహేష్ లు తమ నామినేషన్ లు ఉపసంహరించుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులే బరిలో మిగిలారు. అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాస రావు, కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా, కోశాదికారి ముల్లా సంతోష్ కుమార్ ల .ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, తర్లాన రమేష్ లు ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది నామినేషన్లు వేయగా ఐదుగురు ఉపసంహరించుకున్నట్లు వారు తెలిపారు. రెండేళ్లపాటు కొత్త కార్యవర్గం కొనసాగుతుంది. పార్టీ లకు అతీతంగా వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని, తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న వ్యాపారులకు అధ్యక్ష, కార్యదర్శి కోశాధికారులు ధన్యవాదాలు తెలిపారు. నూతన సంఘం సభ్యులకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురలీకృష్ణ పారిశ్రామికవాడ వ్యాపార సంఘ అధ్యకుడు మల్లా రామేశ్వరరావు అభినందించారు. అలాగే ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వర యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి నప్ప నవీన్, జోగమల్లి, అంబటి రామకృష్ణ కొత్త సత్యం, దడియాల నర్సింహులు కూడా కార్యవర్గాన్ని అభినందించారు.

ధర్మపరిరక్షణకు పాటుపడాలి

- త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి
- స్వామి వారి పిలుపు మేరకు పర్లాం వెళ్లిన డాక్టర్ సూర

విశాలాంధ్ర-టెక్కలి: ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. కోటబొమ్మాళి మండలం తర్లిపేట వద్ద ఉన్న వేదిక్ ఆశ్రమానికి సోమవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు స్వామిజీ పిలుపు మేరకు వెళ్లారు. హైందవ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని ఆరాధించాలని అప్పుడే సంపూర్ణమైన, ఆరోగ్యకరమైన మానవ మునుగడ సాధ్యమవుతుందని తెలిపారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. హైందవ సంస్కృతిలో ప్రకృతి వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.

తర్లికొండ ప్రాంతంలో ఓ ఆయుర్వేద ఆసుపత్రిని, కళాశాలను నిర్మించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా బడ్జెట్

విశాలాంధ్ర - టెక్కలి: రాష్ట్ర టిడిపి పార్టీ ఆదేశాలు మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు సోమవారం టిడిపి పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తి స్థాయి బడ్జెట్ లో సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలకు సమ ప్రాధాన్యత ఇచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగిందని 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ రూ.3,22,359 కోట్లు ఉంటుందని ఆయన అన్నారు. వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ అనేక సవాలను సంక్లిష్ట పరిస్థితులను అధిగమించే రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా బడ్జెట్ ని రూపొందించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ కి,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ధన్యవాదాలు తెలిపారు.పేద మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ను ప్రవేశ పెట్టడం జరిగిందినీ,ఎన్టీఆర్ భరోసా, దీపం 2.0 పథకాలకు రూ. 31,613 కోట్లు విడుదల చేసి ప్రజలకు అండగా నిలబడ్డారని అన్నారు. మేనిఫెస్టో అమలకు ప్రాధాన్యత: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలకు బడ్జెట్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి అద్దం పడుతుందని, రైతులకు పెట్టుబడి సాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్నదాత సుఖీభవ పథకాన్ని బడ్జెట్లో రూ.6,300 కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు వెన్నుదండుగ నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖ రావు,మెండ దమయంతి,దల్లి ప్రసాద్ రెడ్డి, కోళ్ల కామేష్, ప్రఫుల్ల వరిడ, సోడిముడి శివకిరణ్, యాళ్ల మల్లేష్, వాకాడ రామారావు మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహన చోదకులు తప్పు చేస్తే బాదుడే...: ఎస్ఐ

విశాలాంధ్ర - కవిటి: వాహన చోదకులు తప్పు చేస్తే అధిక మొత్తంలో అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఐ వి.రవివర్మ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం కవిటి పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ వాహనాలను నడిపేవారు ఎటువంటి తప్పులు చేయకుండా సక్రమంగా వాహనాలు నడిపితే ఫరవాలేదుగాని, ఇక నుంచి ఏమాత్రం నిర్లక్ష్యం వహించి లైసెన్సులు లేకుండా వాహనాలు నడపటం ,లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వడం,అతివేగంగా వాహనాన్ని నడపడం,ఇన్సూరెన్స్ చేయించకపోవడం తదితర తప్పులు ఏమైనా చేసి ఉంటే ప్రభుత్వానికి భారీగా అపరాధరుసుం చెల్లించుకోవలసి వస్తుందని అన్నారు.ఈ మేరకు నూతన వాహనదారుల వాహన చట్టంలో సవరించిన అపరాధరుసుం వివరాలను ప్రభుత్వం పొందుపరుస్తూ ఉత్తర్వులు జారీచేసిందని ఈ సందర్భంగా తెలియ జేశారు. లైసెన్స్ లేని వ్యక్తికి వాహనదారుడు తన వాహనాన్ని ఇచ్చే పక్షంలో ఆ వ్యక్తి పోలీసులకు గాని, రవాణాశాఖ అధికారులు గాని తనిఖీలు నిర్వహించి నప్పుడు పట్టుబడితే ఇంత వరకూ చెల్లిస్తూ వస్తున్న వెయ్యి రూపాయిల అపరాధ రుసుం తాజాగా పెంచిన రేట్ల మేరకు రూ 5 వేల వరకూ చెల్లించుకోవలసి వస్తుందని తెలిపారు. అదే విధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వ్యక్తికి ఇంతవరకూ రూ 5 వందలు వసూలు చేయగా, నూతన చట్టం ప్రకారం రూ 5 వేల వరకూ వసూలు చేస్తామని తెలిపారు.మైనర్ వాహనం నడిపితే ఇంతవరకూ రూ .5 వందలు వసూలు చేస్తుండగా, ఇప్పుడు దానిని రూ 10 వేల పెంచారని అన్నారు.అతివేగంగా వాహనాలను నడిపితే చిన్న వాహనాలకు ఇంతవరకూ రూ.4 వందలు వసూలు చేస్తుండగా, ఇప్పుడు దాని మొత్తాన్ని రూ 1000, పెద్ద వాహనాలకు రూ. 5 వందలు వసూలు చేస్తుండగా, ఇప్పుడు రూ 2 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని ప్రమాదకరరీతిలో నడిపే పక్షంలో ఇంతవరకూ రూ. 1,000 వసూలు చేస్తుండగా మొదటిసారి పట్టుబడి నట్లయితే రూ 2 వేల అపరాధరుసుం వసూలు చేస్తారు. రెండవసారి గాని పట్టుబడితే దానిని రూ 10 వేల వరకూ వసూలు చేయనున్నట్లుగా ఉత్తర్వులు అందాయని తెలిపారు.

అలరించిన పార్వతీ కళ్యాణం హరికథ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండవ రోజు కార్యక్రమాన్ని పొందల బ్రదర్స్ ఆర్థిక సహకారంతో స్వామి వారికి విశేష అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రామచంద్రాపురం కు చెందిన యండమూరి శికామణి భాగవతారిణిచే పార్వతీ కళ్యాణం హరికథ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువతకు బెట్టింగ్ యాప్స్ వద్దు - చదువే ముద్దు

విశాలాంధ్ర-పలాస: యువత బెట్టింగ్స్ యాప్ పై దృష్టి సారించవద్దని, చదువుపై దృష్టి సారించాలని వజ్రపుకొత్తూరు ఉప తహసిల్దార్ కే మురళి అన్నారు. సోమవారం కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుండి పాత బస్టాండ్ వరకు బెట్టింగ్ యాప్స్ వలన కలిగే అనర్థాల గురించి నిర్వహించిన అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేశ సైనికుడు ముకుంద యువతను బెట్టింగ్ యాప్స్ గురించి కలిగే అనర్థాలు గురించి అవగాహన కలిగిస్తూ ఒక వైపు దేశ సేవ చేస్తూ మరో వైపు ఇలాంటి సామాజిక స్పృహ కలిగిన అంశాలు చేయడం ఆనందదాయకం అభినందనీయమని అన్నారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా ఆటలు ఆడి డబ్బులు చెల్లించక చాలా మంది యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని ఈ ఆటల నుండి అందరూ దూరంగా ఉండాలని కోరారు.పలాస ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ యువత వారి విలువైన సమయాన్ని మొబైల్ ఫోన్ కన్నా చదువు వైపు దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, సమాజానికి తద్వారా దేశానికి మంచి పేరు తెస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో పలాస వాసిపేజ్ దిలీప్ ,జీకే ప్రసాద్ సంపత్రావు జయరాం, దివాకర్ కార్తీక్, శేఖర్ ,తేజ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తా..!

నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ బలగ ప్రవీణ్‌కుమార్

విశాలాంధ్ర-నరసన్నపేట: గ్రామాల్లో డ్రైనేజ్, రహదారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్, బలగ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వి.ఎన్.పురం పంచాయితీ గోకయ్యవలస గ్రామంలో రహదారిపై నిలిచిపోయిన మురికి నీరు నిలిచి, గ్రామంలోని చిన్నారులు, వృద్ధులు ఎదుర్కొంటున్న పలు అనారోగ్య సమస్యలును అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా గ్రామంలోని మురికి కాలువలు నిర్మాణం చేయకపోవటం కారణంగా రహదారిపై మురికి నీరు ప్రవహించి, తీవ్ర అనారోగ్య సమస్యలకు గురౌతున్నామని తెలిపారు. ఈ విషయమై ప్రవీన్ స్పందించి, మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని, సమస్య పరిష్కారానికి తన కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కళ్యాణి స్కూల్లో సైన్స్ డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం సైన్స్ పై డ్రాయింగ్ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ బిందు మాధవి తెలియజేశారు.విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత పెంపొందించేందుకు వారిలో ఉన్న నైపుణ్యతలను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఏవో రాణి తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి వారికి నచ్చినటువంటి సృజనాత్మకత పై ఒక డ్రాయింగ్ వేయడం వల్ల వారి యొక్క తెలివితేటలు మనకు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో జాతీయ స్థాయి గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు

విశాలాంధ్ర - టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఈనెల 4,5,6,7 తేదీల్లో జాతీయ స్థాయి గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ సీజన్-2 పోటీలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో తమిళనాడు, తెలంగాణ, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి 17 బృందాల ద్వారా 500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఆటో మొబైల్ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయుటకు ఈ గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని డైరెక్టర్ తెలిపారు. ఎండ్యూరెన్స్, ఇన్నోవేషన్, బిజినెసాన్, స్కిడ్ప్యాడ్, ఆటోక్రాస్ విభాగాల పై ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో పెట్రోల్ ఆధారితమైనవి 11, ఎలక్ట్రికల్ ఆధారితమైనవి 6 బృందాలు ఉండగా న్యాయనిర్ణేతలుగా ఆటోమొబైల్ రంగంలో ప్రత్యేక నైపుణ్యంగల వ్యక్తులు హాజరవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. పైన పేర్కొన్న విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యం కనపరచిన విద్యార్థులకు రూ. 4 లక్షల విలువైన నగదు బహుమతులను అందజేస్తునట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ సీజన్-2 పోటీలకు కన్వీనర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-కన్వీనర్లుగా డీన్ ఆరెండీ డాక్టర్ డి.శ్రీరాములు, ఈసిఈ హెచ్ఐడి డాక్టర్ వి. అశోక్ కుమార్, సిఎస్ఈ హెచ్ డి డాక్టర్ వై. రమేష్, ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్గా అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘువీర్ దొంటికురిటిలతో పాటు స్టూడెంట్ కన్వీనర్లుగా పి.ఉదయ్ కుమార్, బి. సాయి సాకేత్లు వ్యవహరిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- డిమాండ్ చేసిన అంబేద్కర్స్ ఇండియా మిషన్ నాయకులు, సైనికులు
- డీజీపీ రేసు నుంచి సునీల్ కుమార్‌ను తప్పించేందుకే కుట్ర అని మండిపాటు



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: దళితుల ధైర్యం సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్ ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళంలో ఏఐమ్, దళిత సంఘాల జెఏసి నాయకులు సంయుక్తంగా శాంతియుత నిరసన ప్రదర్శన చేసారు. పి.వి.సునీల్ కుమార్‌పై విధించిన సస్పెన్షన్ ను తక్షణం ఎత్తివేయాలని వారు డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం శ్రీకాకుళం నగరంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసనను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఐమ్ నాయకులు,సైనికులతో పాటు దళిత సంఘాల జెఏసి నేతలు పాల్గొన్నారు. ముందుగా ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను , దళిత సంఘాల జెఏసి కన్వీనర్ డా. కంత వేణులతో పాటు ఇతర నేతలు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం వద్దనే పి.వి.సునీల్ కుమార్ సస్పెన్షన్ ను ఖండిస్తూ శాంతియుతంగా నిరసనలను తెలియజేసారు. దళిత సీనియర్ ఐపిఎస్ అధికారిపై వేధింపులను ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేసారు. కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని కోరారు. దళిత ఐపిఎస్ అధికారి, రాష్ట్ర డీజీపి కాకూడదన్న దురుద్దేశ్యంతోనే ఆయనపై ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం పి.వి.సునీల్ కుమార్ పై చర్యలు తీసుకుంటుందని వారు ఆరోపించారు. వుయ్ స్టాండ్ విత్ పి.వి.సునీల్ కుమార్ అంటూ శాంతియుత నిరసనలో పాల్గొన్న ఏఐమ్ నాయకులు, దళిత సంఘాల జెఏసి నేతలు మద్దతును తెలియజేసారు. ప్రజాస్వామ్య పంథాలో శాంతియుతంగా వారు నిరసనలను తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను,దళిత సంఘాల జెఏసి కన్వీనర్ డా. కంత వేణు లు మాట్లాడుతూ సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఖండించారు. ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్ళారన్న కారణం చూపిస్తూ ఆయనను సస్పెండ్ చేయడం వెనుక కుట్రకోణం దాగి ఉందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీనియర్ ఐపిఎస్ అధికారిగా ఉన్న పి.వి.సునీల్ కుమార్ ను డీజీపి రేసు నుంచి తప్పించేందుకే సస్పెన్షన్ వేటు వేసినట్లుగా వారు ఆరోపిస్తున్నారు. ఎస్.సి వర్గీకరణకి వ్యతిరేకంగా పి.వి.సునీల్ కుమార్ పోరాడుతుండడంతో పాటు దళిత సంఘాల జెఏసిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభలు,సమావేశాలలో పాల్గొంటున్న కారణంగా ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం ఆయనపై మొదట నుంచి కక్ష పూరితంగానే వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దళిత ఐపిఎస్ అధికారిపై ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుండడాన్ని యావత్ దళిత సమాజం గమనిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పి.వి.సునీల్ కుమార్ పై కక్ష సాధింపు చర్యలను కూటమి ప్రభుత్వం మానుకోవాలని వారు కోరారు. పి.వి.సునీల్ కుమార్ పై విధించిన సస్పెన్షన్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. ఈ శాంతియుత నిరసన కార్యక్రమంలో అంబేద్కర్స్ ఇండియా మిషన్ ,దళిత సంఘాల జెఏసి నాయకులు,సైనికులు యజ్జల గురుమూర్తి,పురుషోత్తం రాంబాబు, పెయ్యల చంటి ,భూషణ్, అబ్బాస్,కొత్తూరు సత్యన్నారాయణ,సుంకు రమణ, అరుబారికి రాజు, పట్నాన మహేష్, సాకేటి నాయుడు,రమణ, అరుబారిక రామలక్ష్మణ, యలగాడ దేవ, మహిళా సభ్యులు లింగాల మల్లేశ్వరీ,సీర రాజేశ్వరీ,నీలాపు హారతి, శంకర్, కళ్యాణ్,లింగాల దిలీప్,సలంపూడి వరప్రసాద్,గొండు నవీన్,చప్పల అవినాష్,పాకర్ల అఖిల్, తేజ, శ్యామ్ పాల్గొన్నారు.

దివంగత నేత అప్పయ్యదొర కల సాకారమవుతోంది.. !

విశాలాంధ్ర - పలాస : దివంగత నేత టెక్కలి మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర కల సాకామయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆయన మానసక పుత్రికలైన ఫ్లై ఓవర్ వంతెన పనులు పూర్తి అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతానికి ఎదైనా గుర్తుండే పనులు చేయాలని తపనతో ఉన్న అప్పయ్యదొర బెండిగెడ్డ, బెండిగేటు, కాశీబుగ్గ రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవరు వంతెనలు నిర్మించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో శ్రీకారం చుట్టారు. టెక్కలి ఎమ్మెల్యేగా (2004-2009) వ్యవహరించిన సమయంలో తన సన్నిహితుడు అప్పటి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ డి.ఎన్.రావును భోజనానికి తన ఇంటికి ఆహ్వానించారు. వారిద్దరి మాటల మధ్య బెండిగెడ్డపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనకు 100 సంవత్సరాలు దాటిపోయి శిధిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్దంగా ఉందని, అప్పయ్యదొర ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన చీఫ్ ఇంజనీరు డి.ఎన్.రావు బెండిగెడ్డ వంతెనను పరిశీలించారు. వంతెన నిర్మాణానికి అప్పట్లో సుమారు 5 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, అయితే తన పరిధిలో నిర్మించేందుకు 30 కోట్ల రూపాయలు పైబడి నిధులు మాత్రమే తాను విడుదల చేయగలనని దొర వద్ద ప్రస్తావించారు. వెంటనే అప్పయ్యదొర స్పందించి బెండిగెడ్డపై వంతెన, బెండిగేటు వద్ద, కాశీబుగ్గ రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవరు వంతెనలు నిర్మించాలని ఆయన దృష్టికి దొర తీసుకువెళ్లారు. దీనికి చీఫ్ ఇంజనీరు డి.ఎన్.రావు అంగీ కరించారు. 3 వంతెనల డిజైన్లతో అప్పటి రాజధాని హైదరాబాద్‌లో లిఫ్ట్ లేని 4వ అంతస్తులో ఉన్న రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంనకు అప్పయ్యదొర దస్త్రాలతో పలుమార్లు వెళ్లారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి 28 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. 2009లో నిధులు మంజూరు కావడంతో బెండి, పలాస రైల్వేగేట్ల వద్ద వంతెనలు నిర్మాణాలకు అప్పయ్యదొర శంకుస్థాపన చేశారు. బెండిగేటు ఫ్లై ఓవరు వంతెన నిర్మాణ పనులు నిర్ణిత సమయంలో పూర్తి కాగా కాశీబుగ్గ రైల్వేగేటు నిర్మాణంలో ఇళ్లు, దుఖాణాలు కోల్పోతామని, తమకు అన్యాయం జరుగుతుందని నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. రైల్వే శాఖ పరిధిలో ఉన్న వంతెన పనులు పూర్తి చేసి రైల్వే అధికారులు చేతులు దులుపుకున్నారు. రోడ్డు రవాణా శాఖ పరిధిలో ఉన్న వంతెన పనులు 2009-2019 మధ్య కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో పనులు నిలిచిపోయాయి. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వంతెన నిర్మాణ పనులు జరగలేదు. 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడడం, పలాస ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయం సాధించిన వెంటనే రాష్ట్ర మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా చోటు దక్కడంతో ఆయన వంతెన నిర్మాణానికి దృష్టిసారించారు. నిర్వాసితులతో పలు సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు వెనక్కి తగ్గారు. ఈ సమయంలో వంతెన నిర్మాణంతో పాటు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు వైసీపీ ప్రభుత్వంలో 42 కోట్ల రూపాయలు కేంద్రం వాటా 70శాతం, రాష్ట్రం వాటా 30శాతంగా మంజూరు చేయించుకున్నారు. ఇందులో నిర్వాసితులకు 4 కోట్ల 8 లక్షల రూపాయలు అందజేశారు. ఇంకా నిర్వాసితులకు 20లక్షల రూపాయలు అప్పటి కాంట్రాక్టర్‌కు 3 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్న సమయంలోనే ఎన్నికల నిబంధనల వలన ఆగిపోయాయి. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవ చూపడం ఆయన కృషి వలన వంతెన నిర్మాణ మార్గాలు సుగుమం అవ్వడం గమనార్హం. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఫ్లై ఓవరు వంతెన నిర్మాణ పనులు తిరిగి పున:ప్రారంభించేందుకు దారులు ఏర్పడ్డాయి. అయితే నిర్వాసితుల సమస్య పరిష్కరించడమే పనులు చేపట్టేందుకు మార్గం ఏర్పడింది. కాగా ఇంజనీరింగ్ నిపుణుల అంచనా ప్రకారం ప్రస్తుతం అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులు 16 కోట్ల రూపాయలుగా తేల్చారని తెలుస్తోంది. నిర్మాణ పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా కేంద్ర మంత్రి రామ్మోహానాయుడు సాకారంతో రైల్వే శాఖా మంత్రి అశ్వీన్ వైష్ణవ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఇటీవల 46.64 కోట్ల రూపాయలు నిధులు మంజూరుకు జీవో విడుదలైంది. ఇదిలా ఉండగా ఫ్లై ఓవరు వెంతనకు అంకురార్పణ చేసిన దివంగత నేత అప్పయ్యదొర కావడం, ఆయన గౌరవార్థం నందిగాం మండలానికి చెందిన దొర అభిమానులు వంతెన ముఖద్వారం వద్ద గుర్తుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషం.

బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యత : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశ పెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్ లో సంక్షేమానికి,అభివృద్ధికి, హామీల అమలుకు సమ ప్రాధాన్యత ఇచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ అనేక సవాళ్లను, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా బడ్జెట్ ను రూపొందించిన ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగిందని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రైతులు , మహిళలు కొనుగోలు శక్తి పెరిగేలా, ప్రాంతీయ అసమానతలు అధిగమించేలా అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. మూలధన వ్యయానికి ఖర్చు పెట్టకపోతే రాష్ట్ర ఆర్థిక వృద్ధి ఉండదనే ప్రాథమిక సూత్రాన్ని పాటించి బడ్జెట్ లో మూలధన వ్యయానికి అధిక నిధులు కేటాయించడం జరిగిందని,ఎన్టీఆర్ భరోసా కోసం రూ.27,518 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9407 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6300 కోట్లు, పోలవరానికి రూ.6705 కోట్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్ షిప్ ల కోసం రూ.3377 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కోసం రూ.400 కోట్లు, రహదారుల నిర్మాణం కోసం రూ.4220 కోట్లు, విద్యుత్ శాఖకు 13600 కోట్లు జూన్ 12, 2024 నాటికి ఉన్న రూ.22,500 కోట్ల పాత బకాయిలను, గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలను కూటమి ప్రభుత్వం పున:ప్రారంభించిందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా, దీపం-2.0 పథకాలకు రూ.31,613 కోట్లు విడుదల చేసి ప్రజలకు అండగా నిలబడిందని మేనిఫెస్టో అమలుకు ప్రాధాన్యతను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇవ్వడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.4,000, దివ్యాంగులకు రూ.15 వేలు, అన్న క్యాంటీన్లు 204 ఏర్పాటు, అర్చకులు, ఇమామ్ లు, మౌజన్ లకు గౌరవ వేతనం పెంపు, 16,437 పోస్టులతో డీయస్సీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్ లో రూ.6,300 కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు వెన్నుదన్నుగా నిలబడుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు భారీ ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందని పంటలకు మద్దతు ధర కల్పించేలా, రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచేలా కేటాయింపులు జరపడం చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. అలాగే విద్య, సాగునీటి రంగం, ఐటీ, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఇతర రంగాలకు బడ్జెట్ లో భారీ కేటాయింపులు చేశారు విద్యారంగం బలోపేతం చేయడానికి బడ్జెట్ లో 10.8% మేర నిధులు విద్యారంగానికి కేటాయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2.43 లక్షల మంది విద్యకు దూరమవడం జరిగిందని పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు కేటాయించి విద్యా రంగాన్ని బలోపేతం చేసిందని తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట : సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉప ప్రణాళికలకు కేటాయింపులు పెంచడం జరిగిందని గత బడ్జెట్‌తో పోలిస్తే కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.20,281 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.8,159 కోట్లు మైనారిటీ సంక్షేమానికి రూ.5,434 కోట్లు, ఈ డబ్ల్యూ ఎస్ సంక్షేమం కోసం రూ.10,619 కోట్లు కేటాయించి బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి బాటలు వేయడం కూటమి ప్రభుత్వ విజయమని అన్నారు.

నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించి పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి

- జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి

- జిల్లా ఎస్పీ వారిని మర్యాద పూర్వకంగా కలిసిన ప్రొబేషనరీ ఎస్సైలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసిన ప్రొబేషనరీ ఎస్సైలు సోమవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. వీరు శిక్షణ అనంతరం విశాఖపట్నం రేంజ్ కార్యాలయంలో హాజరవుగా, రేంజ్ డీఐజీ గోపి నాథ్ జట్టి శ్రీకాకుళం జిల్లాకు ఐదుగురు ప్రొబిషనరీ ఎస్సైలను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీని కలిసిన వి.హేమంత్ కుమార్,టీ. వెంకటేష్, ఎస్.శ్రీనివాస్, బి. మోహిని, కె. ప్రేమల దేవి జిల్లాలో స్టేషను రైటర్ విధులు, బీట్ విధానం, ముఖ్యమైన కేసులు దర్యాప్తు, స్టేషన్లో ముఖ్యమైన రికార్డుల నిర్వహణ, బంధోబస్త్, ప్రజా సమస్యలు పరిష్కారం తదితర అంశాలలో ప్రాక్టికల్ శిక్షణ పొందుతారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న నూతన ప్రొబిషనరీ ఎస్సైలకు అభినందనలు తెలిపి,విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, అంకిత భావం,క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకతంగా విధులు నిర్వర్తిస్తు, ప్రజలకు అత్యుత్తమ పోలీస్ సేవలు అందించి, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రాక్టికల్ ట్రైనింగ్ లో బేసిక్ పోలీసింగ్ విధానం గురించి పూర్తి స్థాయిలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు.

సారవకోట కూరాకుల వీధి నీటి సమస్య పరిష్కారానికి ప్రయత్నం : ఎంపీడీవో

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండల కేంద్రంలో కూరాకువీధిలో ఉన్న నీటి సమస్యని ఏ విధంగా పరిష్కరించాలని దానిపై ఎంపీడీవో పీవి వి మురళీమోహన్ కుమార్ సోమవారం ఆ వీధిలో పరిశీలించారు. అక్కడ ఉన్న మూడు బోర్లలో ఏదో ఒక బోర్డలో మోటర్ బిగించి వీధిలో కుళాయిలు ఏర్పాటు చేయుటకు ప్రయత్నాలు చేస్తున్నారు శ్రీ ఉమాత్రై లోకేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న బోరును పరిశీలించారు. దీని ద్వారా నీటి సమస్య పరిష్కారం చేయుటకు అంచనాలు వేస్తున్నారు ఆయనతోపాటు ఆర్డబ్ల్యూస్ జేఈమధు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీముఖలింగం ఆదాయం 858,795 రూపాయలు ఈవో ప్రభాకర్ రావు

విశాలాంధ్ర - జలుమూరు : మండలం శ్రీముఖలింగం లో మహాశివరాత్రి నుండి మూడు రోజులు జరిగే ఉత్సవాలకు ఎనిమిది లక్షల 858795 ఆదాయం లభించిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి పి ప్రభాకర్ రావు తెలిపారు ప్రత్యేక టిక్కెట్ల ద్వారా రెండు లక్షల 260 రూపాయలు పులహరి ప్రసాదం ద్వారా పదివేల344 సోమవారం ఉండి లెక్కింపులో 2,39,844 ఆదాయం లభించిందని కార్యనిర్వాహన అధికారి ప్రభాకర్ రావు తెలిపారు.

మహిళ సాధికారత అనే అంశంపై విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 08) పురస్కరించుకొని జిల్లాలో జరుగుతున్న మహిళ సాధికారత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించిన పోలీస్ అధికారులు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని వివిధ పాఠశాల, కలశాల విద్యార్థులకు మహిళల సాధికారత, హక్కులు,సమానత్వం' వంటి అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యాస రచన పోటీల ద్వారా వ్యక్తపరిచారు. మార్చి 08 అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. అనంతరం ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు మొదలగు వాటిపై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో తక్షణ సహాయంగా డయల్ 100,112 నెంబర్ల ద్వార పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ అధికారులు విద్యార్థిలను సూచించారు.